# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్, మంగళవారం 1 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL




మాట్లాడుతున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్

# రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలి

**ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్**

జైనథ్, మార్చి 31 : రికార్డుల నిర్వహణ, నవీకరణను రోజు సరైన సమయంలో నిర్వహిస్తూ ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం జైనథ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి విలేజ్ పోలీస్ ఆఫీసర్‌ను కేటాయించి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించే దిశగా వ్యవస్థను నిర్మించాలని సూచించారు. సాయంత్రం సమయాల్లో సీఐ, ఎస్సై స్థాయి అధికారులు సందర్శిస్తూ గ్రామంలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొస్తూ పరిష్కరించే దిశగా పోలీసు మీ కోసం అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలన్నారు. వీలైనంత వరకు అన్ని పోలీసు కార్యాలయాల్లో సిబ్బందికి వారాంతపు సెలవు పద్ధతిని అమలు చేసే విధంగా సిబ్బంది విధులను కేటాయించాలన్నారు. కోర్టు డ్యూటీ అధికారి నిందితులు, నేరస్తులకు శిక్షలు పడేవిధంగా సాక్షులను సరైన సమయంలో హాజరు పరిచేలా చూసుకోవాలన్నారు. స్టేషన్ రిసెప్షన్‌లో ఎక్కువ ఫిర్యాదులు వచ్చే విధంగా సిబ్బంది ఫిర్యాదుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా విధులను నిర్వర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, జైనథ్ సీఐ డి.సాయినాథ్, ఎస్సై వి.పురుషోత్తం పాల్గొన్నారు.



# ఘనంగా ఈద్ ఉల్ ఫితర్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం/నేరడిగొండ, మార్చి 31 : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలవ్యాప్తంగా సోమవారం ముస్లింలు ఈద్ ఉల్ పితర్‌ను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించగా.. ఆదివారం నెలవంక దర్శనమివ్వడంతో ఈద్‌ను జరుపుకున్నారు. ఈద్గా మైదానాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. నూతన వస్త్రాలను ధరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సామూహిక నమాజ్ ఆచరించారు. అనంతరం ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు చేశారు. ముస్లిం మత పెద్దల సమక్షంలో ప్రార్థనలు చేసి.. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ఎస్పీ అఖిల్ మహాజన్ బందోబస్తు నిర్వహించారు. ఈద్గాల వద్ద ఈద్ నమాజ్ అనంతరం ముస్లింలకు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్‌లో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌లు ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు.



నేరడిగొండ : రంజాన్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్



# ముస్లింల నిరసన

ఉట్నూర్ : నల్ల బ్యాడ్జీలతో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న ముస్లింలు

- వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- రంజాన్ సందర్భంగా ఈద్గాల వద్ద ప్రార్థనల అనంతరం నిరసన

ఎదులాపురం/ఉట్నూర్, మార్చి 31: ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ముస్లింలు వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా సోమవారం నిరసన తెలిపారు. ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన నిర్వహించారు. ఉట్నూర్ డివిజన్ కేంద్రం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మత పెద్దలు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మోదీ 3.0లో భాగంగా 2024 ఆగస్టు 8న పార్లమెంట్‌లో ముస్లింలకు వ్యతిరేకంగా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ బిల్లుతో అనవసరమైన అల్లర్లు జరుగుతాయని, స్వాతంత్ర్య భారతదేశంలో అందరూ సామానులే కాబట్టి బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రం వక్ఫ్ భూములను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వడానికి చట్టం తెచ్చేందుకు చూస్తుందన్నారు. చట్టాన్ని వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.




ఎదులాపురం : నల్ల కుర్తాలో ఈద్గాహ్‌కి చేరిన బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకులు మజర్

# మంత్రి పదవి @ రూ.8 కోట్లు..?

**రూ.8 కోట్లు ఇస్తావా.. మంత్రి పదవి వదులుకుంటావా అని ప్రశ్నించిన ఓ ఎమ్మెల్యే..!**

- మంత్రి పదవి వద్దు.. నా భార్యకు కార్పొరేషన్ పదవి కూడా వద్దు
- ఆ డబ్బులు మాత్రం నన్ను అడగకు అంటూ బేరం కుదుర్చున్న మరో ఎమ్మెల్యే
- జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన వ్యవహారం



మంచిర్యాల, మార్చి 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ''భయ్యా.. నువ్వు ఎమ్మెల్యేగా గెలిచాక నా దగ్గర రూ.8 కోట్లు తీసుకున్నావ్. అవి కాకుండా ఎంపీ ఎన్నికల్లో నా వాళ్లని గెలిపించేందుకు అదనంగా డబ్బులు కూడా ఇచ్చాను. నువ్వు ఎంపీ ఎన్నికల్లో డబ్బులు తీసుకోకుండా పని చేసినా.. నేను ఆలోచించే వాడిని. కానీ, నువ్వు నా దగ్గర డబ్బులు తీసుకొని కూడా కో ఆపరేట్ చేయలేదు. అది వదిలేయ్. నాకు ఇప్పుడు మంత్రి పదవి వచ్చేలా ఉంది. నా పదవికి నువ్వు అడ్డురావొద్దు.. నీకు పదవి కావాలంటే నీ పైరవీ ఏదో నువ్వే చేసుకో.. నాకు అడ్డు వస్తే మాత్రం నా రూ.8 కోట్లు తిరిగి ఇవ్వాలి. నీ పర్సనల్ చెక్కులు పెట్టి.. నా దగ్గర రూ.8 కోట్లు తీసుకొని ఆరు నెలల్లో తిరిగి ఇస్తానని బాండ్ రాసిచ్చావ్. మంత్రి పదవికి నువ్వు అడ్డు వస్తే నువ్వు ఇచ్చిన చెక్కులు బౌన్స్ చేసి నేను లీగల్ నోటీసు పంపిస్తా'' అంటూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓ ఎమ్మెల్యే మరో ఎమ్మెల్యేకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. దానికి మంత్రి పదవి రేసులో ఉన్న సదరు ఎమ్మెల్యే ఆ రూ.8 కోట్లు ఇప్పుడైతే ఇవ్వలేను. నాకు మంత్రి పదవి వద్దు... నా భార్యకు కార్పొరేషన్ పదవి వద్దు. ఏం లేకున్నా మంచిదే.. ఆ డబ్బులైతే అడగకు. నా నియోజకవర్గానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నదిపై కట్టలు కట్టడానికనో.. విద్య లేదా వైద్య ప్రాజెక్టుల కోసమనో నిధులు ఇచ్చారు. ఇందులో ఎంతో కొంత మిగుల్చుకొని నేను ఇవ్వాల్సిన దగ్గర ఇచ్చుకుంట. ఈ డబ్బులు మాత్రం అడగొద్దు అంటూ బేరం కుదుర్చుకున్నారట. ఇప్పుడు ఈ విషయం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గతంలో అధికార పార్టీ తరపున ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన ఎమ్మెల్యే, అదే పార్టీ నుంచి జిల్లా కేంద్రంగా ఉన్న నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచిన మరో ఎమ్మెల్యేకు రూ.25 లక్షలు తిరిగి ఇవ్వడం లేదని లీగల్ నోటీసు పంపించారు. ఇప్పుడు ఆ రూ.25 లక్షలు ఇచ్చిన ఎమ్మెల్యే సోదరుడు సైతం అదే ఎమ్మెల్యేకు రూ.8 కోట్లు ఇచ్చారట. అవి తిరిగి ఇవ్వాలని.. లేకపోతే అన్న మాదిరే తాను లీగల్ నోటీస్ ఇస్తానని.. లేదా మంత్రి పదవి విషయంలో మిన్నకుండిపోవాలని చెప్పడంతో సదరు ఎమ్మెల్యే మంత్రి పదవి రేసు నుంచి తప్పుకున్నారనే ప్రచారం జిల్లాలో జోరుగా నడుస్తున్నది.

### పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని, కాంప్రమైజ్‌కు ఫోర్స్..

జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే.. మరో ఎమ్మెల్యే బంధువు ఎంపీగా గెలవడానికి డబ్బులు తీసుకోవడం, అవి కాకుండా వ్యక్తిగతంగా చెక్‌లు పెట్టి రూ.8 కోట్లు తీసుకోవడంపై అధికార పార్టీ రాష్ట్ర నాయకత్వం సైతం సీరియస్ అయ్యిందట. జిల్లాలో నీ గ్యాంగ్ చేసే అరాచకాలు చాలు. మాకు మొత్తం తెలుసు.. మంత్రి పదవి విషయంలో జోక్యం చేసుకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని, పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. దీంతో సదరు ఎమ్మెల్యే ఏం చేయాలో తెలియని గందరగోళంలో పడిపోయారట. రాష్ట్రంలోని అధినాయకత్వాన్ని కాదని ఏం చేయలేనని, అలాగని రూ.8కోట్లు ఇప్పుడు ఇచ్చే పరిస్థితి లేదని సదరు ఎమ్మెల్యే మిన్నకుండిపోయినట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. పార్టీ కోసం కష్టపడ్డానని, గడిచిన పదేళ్లలో ఎవరు ఉన్నా.. లేకున్నా ఉమ్మడి జిల్లాలో పార్టీని కాపాడుకుంటూ వచ్చానని.. అది గుర్తించి తనకే పదవి ఇవ్వాలంటూ తనకు సన్నిహితంగా ఉండే మంత్రుల ముందు సదరు ఎమ్మెల్యే మాట్లాడుతున్నట్లు తెలిసింది. కానీ, రాష్ట్రంలో అధికార పార్టీని శాసించే కీలక నేత మాత్రం ఎమ్మెల్యేపై కాంప్రమేజ్ కావాలంటూ ఫోర్స్ చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక సదరు ఎమ్మెల్యే అయోమయంలో పడిపోతున్నట్లు తెలిసింది.

### ఆ కౌన్సిలర్ ఇంటికి క్యూ..

జిల్లా కేంద్రానికి చెందిన ఎమ్మెల్యే రూ.8 కోట్ల చెక్కుల విషయంలో లాక్ అయిపోవడం, ఆయనకు కాకుండా డబ్బులు బాగా ఉన్న మరో నియోజకవర్గ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఖాయమని అధిష్ఠానం నుంచి సంకేతాలు రావడంతో క్షేత్రస్థాయిలోని కేడర్ సైతం అలర్ట్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. తమ ఎమ్మెల్యేకు మంత్రి పదవి రాదని తెలియడంతో మంత్రి పదవి వచ్చే ఎమ్మెల్యేకు సన్నిహితంగా ఉండే మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ మాజీ కౌన్సిలర్ ఇంటికి దందాలు చేసే నాయకులందరూ క్యూ కట్టారట. సార్‌కు చెప్పండి మేము కో-ఆపరేట్ చేస్తాంటూ సదరు కౌన్సిలర్‌కు కొంత ముట్టజెప్పారట. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యేకు అత్యంత సన్నిహితంగా ఉండే ఓ లీడర్ (మంచిర్యాల బైపాస్ రోడ్డులో నాలాపై అక్రమ నిర్మాణం చేస్తున్న ఓ నేత) సైతం భారీ మొత్తం సదరు కౌన్సిలర్‌కు అప్పగించారనే టాక్ నడుస్తున్నది. ఈ కౌన్సిలర్‌ను గతంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే.. మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో గోల్‌మాల్ చేశారంటూ అరెస్టు చేయించారు. ఆ సమయంలో జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యేకు పక్క నియోజకవర్గం ఎమ్మెల్యే (రూ.8కోట్లు ఇచ్చిన ఎమ్మెల్యే) ఫోన్ చేస్తే ఆ విషయం తప్ప మరేదైనా చెప్పండంటూ ఎమ్మెల్యే మాట్లాడారట. దాన్ని మనసులో పెట్టుకున్న రూ.8 కోట్లు ఇచ్చిన ఎమ్మెల్యే తర్వాత చూసుకుందాం.. నేను ఉన్నానంటూ సదరు కౌన్సిలర్‌కు భరోసా ఇచ్చారట. తాజాగా.. మంత్రి పదవి దాదాపు ఖాయమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలోకి అధికార పార్టీ లీడర్లు సదరు మాజీ కౌన్సిలర్‌కు దగ్గరైన ఎమ్మెల్యేకు మంత్రి పదవి వస్తే ఇబ్బందులు తప్పవని.. సదరు నేతకు ముందే ముడుపులు ముట్టచెప్పే పనిలో తలమునకలైనట్లు తెలిసింది. ఏదేమైనా మంత్రి పదవి రేస్ నుంచి రూ.8కోట్లకు జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కాంప్రమైజ్ అవ్వడంపై ఆయన అనుచరులే పెదవి విరుస్తున్నారు. మా సార్‌కు మంత్రి పదవి వస్తుందని విచ్చల విడి చేశామని, ఇప్పుడు తీరా మా సార్‌ను కాదని పక్క నియోజకవర్గం ఎమ్మెల్యేకు పదవి ఇస్తున్నా.. మా సార్ ఉలుకూ.. పలుకూ లేకుండా మిన్నకుండిపోతున్నారంటూ వాపోతున్నారు. ఏ సార్‌కు మంత్రి పదవి వచ్చిన మా పనులైతే ఆపొద్దని క్షేత్రస్థాయిలోని లీడర్లు వేడుకుంటున్నట్లు తెలిసింది. చీప్‌గా రూ.8 కోట్లకు మంత్రి పదవి వదులుకోవడం ఏమిటి.. మమ్ముల్ని అడిగినా మేం ఇచ్చే వాళ్లం కదా అంటూ జిల్లా కేంద్రానికి చెందిన ఎమ్మెల్యే సన్నిహితులు బయట ప్రచారం చేస్తున్నట్లు జిల్లాలో జోరుగా చర్చ నడుస్తున్నది.



19ఏడీబీ31బీ : వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్

# రాజీవ్ యువ వికాసం 14 వరకు పొడిగింపు

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

ఎదులాపురం, మార్చి 31 : రాజీవ్ యువ వికాసం స్వయం ఉపాధి పథకానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఈబీసీ, బీడబ్ల్యూఎస్‌లకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. సోమవారం సాయంత్రం ఈ పథకంపై డిప్యూటీ సీఎం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంప్ కార్యాలయం నుంచి కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలదేవి, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న పత్రాలను ప్రజాపాలన సేవా కేంద్రం, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో అందజేయాలని, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకొనేవారు, అదనపు చార్జీలు చెల్లించనవసరం లేదని స్పష్టం చేశారు. వరుస సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు గడువు పెంచడం జరిగిందని, జూన్ 2న అర్హులకు మంజూరు పత్రాలు అందజేయాలని, జూన్ 2 నుంచి 9 వరకు రోజు ఒక మండలం చొప్పున నియోజకవర్గం అంతటా సాంక్షన్ లేటర్లు అందజేయాలని తెలిపారు. జూన్ 9 తర్వాత శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాలని, రూ.50 వేల వరకు లబ్ధి పొందిన వారికి వారం రోజులపాటు, రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు లబ్ధి పొందిన వారికి 15 రోజులపాటు, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ప్రయోజనం పొందిన వారికి నెలరోజుల పాటు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన వారికి వెంటనే గ్రౌండింగ్ చేసి నగదు అందజేయాలని కోరారు. జూలై మొదటి వారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ఈనెల 14 వరకు పొడిగించారని, ఆసక్తి గల వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ సీవీఎన్ రాజు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ మనోహర్, బీసీ కార్పొరేషన్ అధికారి రాజలింగు, ఈడీఎం రవి పాల్గొన్నారు.

### నిర్మల్‌లో..

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 31 : రాజీవ్ యువ వికాస పథకానికి ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఈ పథకంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. నిర్మల్‌లో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, మైనార్టీ అధికారి మోహన్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్ ప్రవేశ పరీక్షలో స్టేట్ టాపర్



వెంకటేశ్వర్

ఖానాపూర్, మార్చి 31: సైనిక్ స్కూల్ 2025–26 సంవత్సరానికి గాను ఆరో తరగతి ప్రవేశాలకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ప్రవేశ పరీక్షలో నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సోమర్‌పేట్‌కు చెందిన నస్పూరి వెంటేశ్వర్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. తల్లి గంగామణి బీడీలు చేడుతుండగా.. తండ్రి సంతోశ్ గల్ఫ్ వెళ్లాడు. కుమారుడిని ఎలాగైన ఉన్నత చదువులు చదించాలన్న ధృడ సంకల్పంతో కడెం మండలం లింగాపూర్ గ్రామంలోని శాంతినికేతన్ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నారు. మొదటి నుంచి చదువులో చురుకుగా ఉండే వెంకటేశ్వర్‌కు పాఠశాల సిబ్బంది అదే పాఠశాలలో సైనిక్ స్కూల్, నవోదయ, గురుకుల ప్రవేశ పరీక్షలకు కోచింగ్ ఇచ్చారు. ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో వెంకటేశ్వర్ 100 మార్కులకు 99 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ నిశీత తెలిపారు.



పెట్రోల్ బంక్ మెషిన్ వద్ద కూలర్ ఏర్పాటు

## పెట్రోల్ బంకు మెషిన్‌లకు కూలర్లు

*ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు దంచికొడుతున్నాయి. దాదాపు 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇనుప వస్తువులు వేడిని గ్రహించి హీటెక్కుతున్నాయి. తీవ్రమైన ఎండల నేపథ్యంలో పెట్రోల్ బంకుల్లోని మిషన్లు కూడా వేడెక్కుతున్నాయి. ఈ హీట్‌ను తగ్గించడానికి నిర్వాహకులు కూలర్లు ఏర్పాటు చేశారు. తాజాగా శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్‌చౌక్‌లో గల పెట్రోల్ బంక్‌లో కూలర్లు ఏర్పాటు చేశారు.*

*- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ.*

# కళావిహీనంగా అర్బన్ పార్కులు

**కేసీఆర్ పాలనలో కళ కళ లాడిన పార్కులు**

- మున్సిపల్ అధికారుల నిర్వహణ లేక అస్తవ్యస్తం
- ఎండుతున్న మొక్కలు.. ఆనవాళ్లు కోల్పోయిన వాకింగ్ ట్రాక్‌లు
- వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల వేడుకోలు



పార్కులోపల మొక్కలు ఎండిపోయి ట్రాక్‌లు అస్తవ్యస్తంగా మారిన దృశ్యం

ఆదిలాబాద్, మార్చి 31(నమస్తే తెలంగాణ) : పట్టణవాసుల ఆరోగ్యంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడానికి కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన మున్సిపల్ పార్కుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో గల ప్రభుత్వ ఖాళీ స్థలాల్లో పార్కులను ఏర్పాటు చేశారు. కాలనీవాసులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేయడానికి ట్రాక్‌లు, వ్యాయామం చేయడానికి అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచారు. చిన్న పిల్లలు ఆడుకునేందుకు ఆట పరికరాలను ఏర్పాటు చేశారు. పలు రకాల మొక్కల పెంపకం చేపట్టి చుట్టూ రక్షణగా కంచెను ఏర్పాటు చేయడంతోపాటు ప్రహరీలను ఏర్పాటు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం పార్కుల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించడంతో స్థానికులకు పలు రకాలుగా ఉపయోగపడ్డాయి.

### నిర్వహణ లేక అస్తవ్యస్తం

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో లక్షల రూపాయలతో నిర్మించిన మున్సిపల్ పార్కులు అధికారుల నిర్వహణ ఫలితంగా అధ్వానంగా మారాయి. ప్రభుత్వం మున్సిపాలిటీలకు అరకొర నిధులు మంజూరు చేస్తుండడంతో వీటి నిర్వహణకు డబ్బులు లేక గాలికొదిలేశారు. కొన్ని పార్కుల తాళాలు సంవత్సరం నుంచి తీయడం లేదు. పచ్చదనంలో భాగంగా నాటిన మొక్కలకు నీరు అందకపోవడంతో ఎండిపోగా, వాకింగ్ ట్రాక్‌ల ఆనవాళ్లు కనపించడం లేదు. చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పరికరాలు ధ్వంసమయ్యాయి. మున్సిపల్ పార్కులు మూతపడడంతో స్థానికులు వాకింగ్ చేయడం లేదు. చిన్న పిల్లలు ఆడుకునే అవకాశం లేకుండా పోయింది. బీఆర్ఎస్ పాలనలో పచ్చదనంతో కళకళలాడిన మున్సిపల్ పార్కులు ప్రస్తుతం కళావిహీనంగా దర్శనమిస్తున్నాయి. అధికారులు స్పందించి మున్సిపల్ పార్కులను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.